క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: మనం-మన ఊరు-మన ఈదుమూడి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కావూరి వాసు తెలియజేశారు. ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు చిన్న పిల్లలు, ఎముకలు కీళ్ల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ చేస్తున్న చంద్రశేఖర్, వెంకటశ్రావణి, తిరుపతమ్మ

కొత్తపట్నం: మండలంలోని చాకిరేవుమిట్ట కాలనీ, దంకనదొర కాలనీ, దంకన్ తోట కాలనీల్లో నివసిస్తున్న ఎస్టీల తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు రూ.67 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ కాలనీలకు ఒకేచోట ట్యాంకు నిర్మించేందుకు జల జీవన్ మిషన్ నుంచి 60 వేల లీటర్ల ట్యాంకు నిర్మించనున్నారు. సర్పంచ్ మాకాని వెంకటశ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు చలంచర్ల తిరుపతమ్మ ఆధ్వర్యంలో శనివారం ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.చంద్రశేఖర్, ఏఈ వంశీకృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రామలింగం వెంకట్రావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విష్ణుప్రియ, మధుప్రియ, మాజీ ఉపసర్పంచ్ ఏడుకొండలు, బాషా తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ



చిన్నారులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

అల్లూరు (కొత్తపట్నం): నిరుపేద కుటుంబాల పిల్లలకు మదర్‌థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని అల్లూరు ఆర్‌ఆర్ కాలనీలో నివాసముంటున్న నిరుపేద కుటుంబాల చిన్న పిల్లలకు భోజన ప్యాకెట్లు ఇచ్చారు. చిట్టితోటి రాహుల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హెల్పింగ్ టీం సభ్యులు ఆర్గనైజర్ డి.కేశం, ఎం.శరణ్య, ఎం.రాజ్‌కుమార్, ఎం.సన్నీ తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ ఆలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: పుష్య మాసం శనివారం సందర్భంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మార్కాపురానికి చెందిన జవ్వాజి వెలుగొండయ్య సహకారంతో భక్తులకు అన్నదానం చేసినట్ల కమిటీ సభ్యులు జగన్, రత్నం శెట్టి, జి.లక్ష్మీనారాయణ తెలిపారు.

నలుగురు జూదరులు అరెస్టు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి 4600 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. పేకాట ఆడినా, అక్రమంగా మద్యాన్ని అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ బి.నాగమణి తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. మండలంలోని జేబీకే పురం ఓసీ అంగన్‌వాడీ కార్యకర్త, కంభం మండలం లింగోజీపల్లె ఓసీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సచివాలయంలో నోటిఫికేషన్ అంటించనున్నట్లు పేర్కొన్నారు.

కుల గణనకు సహకరించండి

● నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



సంతపేటలో కులగణన చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది

ఒంగోలు సబర్బన్: కులగణనకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని నగర కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని 70 వార్డు సచివాలయాల పరిధిలో కులగణను కమిషనర్ లాంఛనంగా ప్రారంభించారు. నగరంలో జరుగుతున్న కులగణనను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పది రోజుల్లో కుల గణన సర్వే పూర్తి చేయాలని వలంటీర్లకు, వార్డు సచివాలయ సిబ్బందికి, నోడల్ అధికారులను ఆదేశించారు. నగరంలోని 70 వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులాల వివరాలతో పాటు సామాజిక పరిస్థితులు, అందుకు సంబంధించిన వివరాలను ప్రత్యేక ప్రశ్నావళితో రూపొందిస్తారని వెల్లడించారు. ఆ వివరాలను గ్రామ, వార్డు వాలంటీర్ యాప్‌లోని కులగణన సర్వే అనే మాడ్యూల్‌లో నమోదు చేస్తారని వెల్లడించారు. ఈ సర్వే రెండు విభాగాలుగా కుటుంబ వివరాలు, వ్యక్తిగత వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. నగరంలోని వివిధ వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న కుల గణన సర్వేలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు నగర ప్రజలకు పలు సూచనలు చేశారు. కుల గణనకు వచ్చే వలంటీర్లకు, వార్డు సచివాలయ సిబ్బందికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ నోడల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటున్నారు.

కులగణన పకడ్బందీగా చేపట్టాలి

● జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి

అల్లూరు (కొత్తపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి అధికారులను ఆదేశించారు. కులగణ సర్వేలో



అల్లూరులో కులగణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి

భాగంగా అల్లూరులో జరుగుతున్న ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్‌లో ఏ విధంగా చేస్తున్నారు, ఎంత మందికి చేశారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటలకే సర్వే ప్రారంభించాలని, ఆ సమయంలో ప్రజలు పనులకు వెళ్లడా ఇంటి దగ్గరే ఉంటారని తెలిపారు. ఈ నెల 28 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చేయాలన్నారు. సర్వేలో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లూరు ఎంపీటీసీ మిట్నసల శాంతారావు, ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య, మండల పరిషత్ ఏఓ నరేంద్రదేవ్, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కమిషనర్ చాంబర్ ప్రారంభం



కమిషనర్ చాంబర్‌ను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కమిషనర్ చాంబర్‌ను నగర మేయర్ గంగాడ సుజాత శనివారం ప్రారంభించారు. ఈ మేరకు ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ కమిషనర్ ఛాంబర్‌ను అధునాతనంగా పునరుద్ధరించామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ఛాంబర్‌ను ఆధునీకరించినట్లు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లు, ఇతర సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా మార్పులు చేశామని చెప్పారు. నగర ప్రజలు వచ్చి కమిషనర్‌ను కలిసి వారి సమస్యలు చెప్పుకోవటానికి అనుగుణంగా మార్పులు జరిగాయన్నారు. ఉన్నతాధికారులు వచ్చినా సమీక్షలు నిర్వహించడానికి అనుగుణంగా ఛాంబర్‌ను పునరుద్ధరించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కేవీ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, చల్లా తిరుమల రావు, తాడి కృష్ణలత, నీలరాజు సరోజ, చింతపల్లి గోపీచంద్, పుసుపులేటి శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అబద్ధాల బీజేపీని ఓడించాలి

● సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ఒంగోలు టౌన్: దేశంలోని అన్ని వర్గాల ప్రజలను దగా చేసిన బీజేపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఎల్బీజీ భవన్‌లో శనివారం జరిగిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజున దేశ వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలను ఇవ్వడం, ఆయా పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళతాం అని తెలిపారు. రెండు పర్యాయాలుగా అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ మరోసారి దేశ ప్రజలను అబద్ధాలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. దేశ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీయడమే కాకుండా మతతత్వాన్ని పెంచి పోషిస్తూ చిచ్చు రాజేస్తుందని మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న మోడీ కేవలం ధనవంతుల కోసం మాత్రమే పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ నగరంలో రైతులు ఉద్యమం చేసిన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులకు వెన్నుపోటు పొడిచిన మోడీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం వచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి చెప్పారు. అనేక ఏళ్లుగా రైతులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా నాయకులు పీవీఆర్ చౌదరి అన్నారు. సమావేశంలో రైతు నాయకులు లలితకుమారి, కంకణాల రమాదేవి, భీమవరపు సుబ్బారావు, పమిడి వెంకటరావు, చుంచుశేషయ్య పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో తెగుళ్ల నివారణ



రాజుపాలెంలో మిర్చిపంటలను పరిశీలిస్తున్న రవీంద్రరెడ్డి, అన్నపూర్ణమ్మ, మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: మిరపలో వచ్చే ఆకుముడత, నల్లతామర పురుగును నివారించేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. మండలంలోని రాజుపాలెం, గమళ్లపాలెం గ్రామాల్లో మిర్చి పంటల సాగుచేస్తున్న పైరును ఏటీఎంఏ అన్నపూర్ణమ్మ, రవీంద్రరెడ్డి, ఉద్యానవనశాఖాధికారి తేజ, ఏఓ మోహన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. మిర్చి సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిరపలో ఆకుముడత, నల్లతామర వల్ల జరిగే నష్టాన్ని నివారించవచ్చన్నారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ తెల్లదోమను గుర్తించి అరికట్టడానికి ఎకరానికి 20 నుంచి 25 వరకు పుసుపురంగు జిగురు అట్టలు పెట్టుకోవాలన్నారు. నల్ల తామర పురుగులను గుర్తించి అరికట్టడానికి ఎకరాకు 20–25 వరకు బులుగు రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలని సూచించారు. మిరప పంట చుట్టూ కంచె పంటగా జొన్న గానీ మొక్కజొన్న గానీ 2,3 వరుసల్లో వేసుకుంటే దోమ లేక పురుగు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరమైన మోతాదులో వేసుకోవాలన్నారు. వీఏఏలు మృదులత, రైతులు పాల్గొన్నారు.

నగరంలోని ఆలయాల శుద్ధి



ఆలయాలను శుద్ధి చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఒంగోలు నగరంలోని గాంధీనగర్లో మహిళలు రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేసి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పవిత్రమైన అయోధ్యలో శ్రీరామ చంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని మకర సంక్రాంతి రోజు నుంచి 22వ తేదీ సోమవారం వరకు దేశంలోని అన్ని దేవాలయాల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఇంట్లో, ప్రతి దేవాలయంలో ఐదు దీపాలు వెలిగించి శ్రీరామ నామ జపం చేయాలని మహిళలు పేర్కొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా



మండల స్థాయిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

నాగులుప్పలపాడు: గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ముఖ్యమంత్రి చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో నాగులుప్పలపాడు మండలం నుంచి రాష్ట్ర స్థాయి క్రీడల వరకు క్రీడాకారులు రాణించాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మండల స్థాయిలో గెలిచిన క్రీడాకారులకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీలో మండల ప్రథమ విజేతగా నిలిచిన కనపర్తి 1, 2 సచివాలయాల క్రీడాకారులకు, బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన ఉప్పుగుండూరు సచివాలయం, ఖో-ఖోలో విజేతగా నిలిచిన నాగులుప్పలపాడు సచివాలయం క్రీడాకారులకు బహుమతులు అందజేసి నియోజకవర్గ క్రీడలకు వెళ్లే క్రీడాకారులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమణి, ఎంఈవో రవి, లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, పోలినేని కోటేశ్వరరావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఘట్టమనేని అశోక్, పాలేరు నాగేశ్వరరావు, అనురాధయ్య, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీలకు త్రోవగుంట జట్టు

ఒంగోలు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి టోర్నమెంట్‌లో త్రోవగుంట టీం ప్రతిభ కనబరిచింది. మొత్తం 50 డివిజన్లకు గాను అర్బన్ ప్రాంతాన్ని రెండు క్లస్టర్లుగా విభజించారు. ఇందులో ఒక క్లస్టర్‌లో ఉన్న త్రోవగుంట జట్టు శుక్రవారం జరిగిన ఏడు మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించింది. చివరి మ్యాచ్ దేవుని చెరువు జట్టు- త్రోవగుంట 1 జట్టు మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన త్రోవగుంట జట్టు 63 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దేవుని చెరువు జట్టు 53 పరుగులు మాత్రమే చేయడంతో త్రోవగుంట జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది. జట్టు త్వరలో జరిగే నియోజకవర్గస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. నియోజకవర్గ స్థాయిలో ఒంగోలు అర్బన్ ప్రాంతం నుంచి రెండు జట్లు, ఒంగోలు మండలం ఒకటి, కొత్తపట్నం ఒక జట్టు పాల్గొంటాయి.



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన త్రోవగుంట జట్టు

పోలింగ్ బూత్‌ల పరిశీలన



నేలటూరు పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఇన్‌చార్జి తహశీల్దార్ ఆశాజ్యోతితో ఎస్ఐ శ్రీకాంత్

మద్దిపాడు: మండలంలోని నేలటూరు పెదకొత్తపల్లి గ్రామాలకు చెందిన పోలింగ్ బూత్‌లను ఇన్‌చార్జి తహశీల్దార్ ఆశాజ్యోతి, ఎస్ఐ శ్రీకాంత్, ఎంఈఓ ఎం శ్రీనివాసరావులు నేలటూరు, పెదకొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలను పరిశీలించారు. బూత్‌లు పోలింగ్ చేసుకోవడానికి అనువుగా ఉందీ లేనిది, ర్యాంపుల ఏర్పాటు, వారు పూర్తి స్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ సమయంలో గ్రామంలో ఏదైనా గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయా అంటూ గ్రామస్తులను విచారించారు. కార్యక్రమంలో వారి వెంట రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

పొదిలి రూరల్: దేశంలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు, ఏలూరు పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణ, సర్పంచ్ సింగయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదు కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: గ్రామాల్లో రైతులు పండించిన కంది పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు ప్రభుత్వం మండలంలోని ఆరవల్లిపాడు, వద్దిపాడు, ఇండ్లచెరువు, మంగినపూడి, పోలేపల్లి గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ ఏడాది మండలంలో సుమారు 4 వేల ఎకరాలు కంది పంట సాగు చేశారని, 1600 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసినట్లు ఆయన వివరించారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలకే కందులను కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం ఆరవల్లిపాడులో రైతులు సాగు చేసిన కంది పంటను ఏఓ పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

● డీపీహెచ్ఎన్ సుగుణమ్మ



గుండ్లాపల్లి హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీపీహెచ్ఎన్ సుగుణమ్మతో వైద్యశాఖ సిబ్బంది

మద్దిపాడు: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ సుగుణమ్మ అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి హెల్త్ సెంటర్‌ను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె గర్భిణులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రోజుకు ఎంత ఓపీ వస్తోంది, వారికి ఏం మందులు అందిస్తున్నారు అన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులను మూడు నెలల్లోగా నమోదు చేసుకోవాలని, వారికి అన్ని పరీక్షలు నిర్వహించి వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. మండలంలో అందరు ఏఎన్ఎంలు చిన్నారులకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్‌బాబు, డీపీఎం సుబ్బలక్ష్మి, ఎంఐఎస్ శ్రీధర్, మద్దిపాడు సీహెచ్‌ఓ లలితమ్మ, హెచ్‌వీ కే సీతమ్మ, నాగరాజి సూపర్‌వైజరు బాల కోటయ్య, ఏఎన్ఎం రంజాన్‌బీ, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి లక్ష్మీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజంపల్లిలో వన మహోత్సవం



కలుపు తీస్తున్న విద్యార్థులు

దర్శి: జాతీయ సేవా పథకం వన మహోత్సవం కార్యక్రమం రాజంపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. వేప, చింత, కానుగ వంటి అడవి మొక్కలు నాటారు. గ్రామ పరిసరాల్లో ఉన్న వయ్యారి భామ కలుపు మొక్కలను నిర్మూలించారు. బాపట్ల కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పంటలు వేసుకునే ముందు భూసార పరీక్షలు చేయించి శాస్త్రవేత్తలు చెప్పిన విధంగా పంటలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. రైతులు అనుమానాలు, సందేహాలు నివృత్తి చేశారు.

సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలి

యర్రగొండపాలెం: ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ సక్రమంగా నిర్వహించాలని డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, పంచాయతీరాజ్ శాఖ, ఫారెస్ట్, గ్రామీణ నీటిపారుదల శాఖ, నాడు-నేడు పనులకు త్వరలో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. ఆడిట్ సిబ్బందికి సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం అందించి ఆడిట్ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. తప్పులు జరిగినట్లు రుజువు అయితే నిబంధనలకు లోబడి చర్యలు తీసుకుంటారని ఆమె హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, ఏపీవోలు శైలజ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, సలకనూతల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎస్సై వెంకట సైదులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో కిటికీలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.సుబ్బారావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.